# స్వల్ప వాతావరణ మార్పుల నెపంతో ప్రాజెక్టులను అడ్డుకుందామా..!

వెలుగు వెంట చీకటి, దారి వెంట ముళ్లు, దీపం వెలిగితే నల్లటి మసి, శిలాజ ఇంధనాలను కాల్చితే ప్రమాదకర కార్బన్ ఉద్గారాలు, అభివృద్ధి కోరుతూ ప్రాజెక్టుల స్థాపనతో కొంత మేరకు వాతావరణ కాలుష్య మార్పుల సహజంగానే ఇమిడి ఉంటాయి. ప్రపంచంలో ఏ భారీ ప్రాజెక్టు లేదా మౌలిక వసతుల కల్పన జరిగినా పర్యావరణ ఆరోగ్యానికి స్వల్ప విఘాతం కలగక తప్పదు. ఇలాంటి భారీ ప్రాజెక్టులు నిర్మించ తలపెట్టిన ప్రతి సారి పర్యావరణ ప్రేమికులతో పాటు (కుహనా) మేధావులు, లాభాపేక్ష కోరుకునే స్వార్ధ సంఘాలు, ప్రజా సంఘాలు తమ గళాలను వివిధ కారణాలతో వినిపిస్తూందే ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయాలను ఉపసంహరించు కోవాలని సమ్మెలు, నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు లాంటివని నిర్వహించడం కూడా చూస్తున్నాం. ప్రజలకు మరిన్ని సౌకర్యాల కల్పించే క్రమంలో ప్రకృతి సహజత్వానికి కొంత వరకు ప్రతికూల ఫలితాలు కలుగవచ్చు. ఇటీవల దేశంలో చేపట్టిన రెండు భారీ అభివృద్ధి ప్రాజెక్టులైన 'దియోధర్ అంతర్జాతీయ విమానాశ్రయం', 'బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ రహదారు'లను మన ప్రధాని ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు కనీస అవసర మౌలిక వనరుల కల్పన నిమిత్తం చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టుల వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని కొన్ని స్వచ్ఛంధ సంస్థలు, పర్యావరణానికి తామే అసలైన యజమానులమని భావించే సమూహాలు గొంతుచించుకున్నప్పటికీ ప్రయోజనం కనిపించలేదు.

### బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ హైవే:

దేశ ప్రధాని ఫిబ్రవరి 2020లో శంకుస్థాపన చేసిన 'బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ హైవే' ? 14,850/– కోట్ల వ్యయంతో 296 కిమీ మేర నాలుగు–వరుసల ఎక్స్‌ప్రెస్ రహదారిని రికార్డు సమయంలో 29 మాసాల్లో నిర్మించడం విశేషంగా పేర్కొనబడుతున్నది. అన్ని రంగాల్లో వెనుకబడిన యూపీ, యంపీ రాష్ట్రాల్లో భాగమైన బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఎలాంటి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన భారీ ప్రాజెక్టులు రాకుండా గతం పర్యావరణ పరిరక్షణ సంఘాలు అడ్డుకున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో చిత్రకూట్ నుంచి ఢిల్లీకి ప్రయాణ సమయం 4 గంటల వరకు తగ్గుతున్నదని, ఈ సౌకర్యంతో ఆ ప్రాంతం అభివృద్ధి వెలుగులను చూడనుందని విశ్లేషకులు అంటున్నారు. నీటి కొరత అధికంగా ఉన్న బుందేల్‌ఖండ్ ప్రాంతవాసులు జీవనోపాధ కోసం సమీప పట్టణాలకు వలసలు వెళ్లడం సర్వసాధారణంగా జరుగుతూనే వస్తున్నదని గుర్తుచేసుకోవాలి.

### దియోధర్ ఇంటర్నేషనల్ ఏయిర్‌పోర్ట్:

దియోధర్ అంతర్జాతీయ విమానాశ్రయం, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో ఈ వెనుకబడిన ప్రాంతాల ప్రజలు నవ్య డిజిటల్ లోకానికి దగ్గరకానున్నారు. దియోధర్ ప్రాంతం చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిలయంగా పేరొందింది. ఝార్ఖండ్‌లోని ఈ వెనుకబడిన ప్రాంతంలో డాబర్ కంపెనీ పరిశ్రమ కూడా పని చేస్తున్నది. గతంలో ఈ ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణాలను పర్యావరణవేత్తలు తమ ఆందోళనలతో నిన్నటి వరకు నిలువరించగలిగారు. గతంలో పశ్చిమ బెంగాల్‌లో తలపెట్టిన 'టాటా నానో ప్రాజెక్టు'ను పలు యన్‌జిఓలు వ్యతిరేకించడం, స్థానిక అమాయకులను సామ దాన బేధ దండోపాయాలు ప్రయోగించి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయడంతో పనులను మధ్యలోనే ఆపేసి టాటా కంపెనీ బయటకు రావడం మనకు గుర్తుంది. దేశ సత్వర సుస్థిరాభివృద్ధిలో కీలక పాత్రను నిర్వహించే భారీ ప్రాజెక్టులు వెనుకబడిన ప్రాంతాల్లో రాకుండా ఆర్థిక లాభాపేక్ష కలిగిన పర్యావరణ సంఘాలు నిరంతరం ఆందోళనలు చేస్తూ నిబద్ధతగల సంఘాలకు కూడా చెడ్డ పేరు తెచ్చేలా, ప్రగతిని అడ్డుకోవడం దేశ నలుమూలల పలు సందర్భాల్లో జరుగుతోంది. అదే విధంగా ఒడిసా రాజధాని భువనేశ్వర్ సమీపంలో జె. కె. స్టీల్ కంపెనీ 1174 హెక్టార్లలో ఏడాదికి 13.2 మిలియన్ టన్నుల ఉక్కును తయారు చేయగల పరిశ్రమ పనులను నిలువరించడానికి నేటి పర్యావరణ ప్రేమికులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

### వేదాంత కాపర్ కంపెనీ:

తమిళనాడు తుతుకుడిలో వేదాంత కంపెనీ కాపర్ లోహ పరిశ్రమ అదనంగా సాలీనా ఉత్పత్తిని 4 లక్షల టన్నుల నుంచి 8 లక్షల టన్నులకు స్థాయికి పెంచడానికి, ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద కాపర్ పరిశ్రమగా నిలిపేందుకు పనులను ప్రారంభించగా ఆందోళనల వల్ల పరిశ్రమల స్థాపన ఆగిపోవడంతో 20,000 మంది ప్రత్యక్ష ఉద్యోగులు, పరోక్షంగా దాదాపు లక్ష ప్రజలు ప్రభావితం అవడం జరిగింది. ఇలాంటి భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు రాకుండా అడ్డుకునే అశాస్త్రీయ, అనాలోచిత, అసంబద్ధ మేధావులు,ఆందోళనకారులు యాజమాన్యాలతో కాని, ప్రజా వేదికపై బహిరంగ చర్చలకు గాని రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయడం చూసాం. భారీ పరిశ్రమలు రాకుండా విదేశీ, స్వదేశీ బడాబాబులు తమ స్వార్ధ ప్రయోజనాలకు కృత్రిమ పర్యావరణ ఉద్యమాలకు ఊపిరిపోస్తూ వాటి స్థాపనను, ఉత్పత్తులను అడ్డుకోవడం పరిపాటి అయ్యింది.

అహ్మదాబాదు – ముంబాయి హై స్పీడ్ రైల్ కారిడార్:

జపాన్ సంస్థ ఆర్థిక సహాయంతో కేంద్ర రైల్వే శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 'అహ్మదాబాదు – ముంబాయి హై స్పీడ్ రైల్ కారిడార్' ప్రాజెక్టుకు నిన్నటి ఉద్ధవ్ థాకరే నేతృత్వ మహారాష్ట్ర ప్రభుత్వం అటవీ, భూసేకరణలను ఇవ్వకపోవడంతో ?1,10,000 కోట్ల (జపనీ సంస్థల పెట్టుబడులు ? 88,000 కోట్లు) పనులు ఆగిపోయాయి. నేడు ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం వెంటనే ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడం జరిగింది.

ప్రపంచ జనాభాలో 17 శాతంగా ఉన్న భారతదేశం కేవలం 5 శాతం ప్రపంచ కార్బన్ ఉద్గారకాలకు కారణం అవుతున్నదని మరిచిపోరాదు. ప్రభుత్వాలు, పర్యావరణ ప్రేమికులు అభివృద్ధికి, వాతావరణ మార్పులకు సమ ప్రాధాన్యాన్ని ఇస్తూ, పర్యావరణానికి కనిష్ట హానితో భారీ ప్రాజెక్టులను రూపకల్పన చేస్తూ మారుమూల ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలను రుచి చూపవలసిందే. వాతావరణ మార్పుల ప్రచారం, అమలులో భారత ప్రభుత్వం నిబద్ధతతో అంతర్జాతీయ జీ7, ఐ2యూ2, క్వాడ్ సమావేశాల్లో తన వాదనలు వినిపిస్తూనే ఉన్నది. తీవ్ర వాతావరణ మార్పులకు కారణమైన పరిశ్రమలను స్థాపించతలపెట్టిన స్వార్ధ పారిశ్రామికవేత్తలను, అవినీతి ప్రభుత్వ వ్యవస్థలు, ప్రతిపక్ష పార్టీలు పలు ఆందోళనలతో అడ్డుకొని ప్రాజెక్టులు రాకుండా చేయగలిగారు. కాని విచక్షణ మరిచిన పర్యావరణ ప్రేమికులు అన్ని ప్రాజెక్టులను వ్యతిరేకించే అనాలోచిత, అశాస్త్రీయ, స్వార్థపర 'మేతా'వుల నిరసనలను అదుపు చేస్తూ భారీ ప్రాజెక్టులతో పాటు దేశ సుస్థిరాభివృద్ధి దిశగా చిన్న మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పుతూ అభివృద్ధి చెందిన దేశంగా భారతాన్ని నిలుపుదాం. అన్ని వర్గాలకు చెందిన అణగారిన బడుగుల బతుకుల్లో ప్రగతి వెలుగులు చూపుదాం.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ప్రభుత్వ పథకాలన్నింటికీ ఆధార్ లింక్

## –ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, జూలై 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు, రాయితీలు, సేవలు పొందాలంటే లబ్ధిదారులు తమ ఆధార్ వివరాలను తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై తాజాగా ఆర్డినెన్స్ జారీ చేసింది.

శుక్రవారం నుంచే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని తెలిపింది. ప్రజల వ్యక్తిగత సమాచారంతో కూడిన ఆధార్‌కు గోప్యత అవసరమని, దానిని నిర్బంధం చేయకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే రూలింగ్ ఇచ్చింది. అయినప్పటికీ... ఆధార్ సహా ప్రజలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం సేకరిస్తూనే ఉంది. ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు, రాయితీలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బట్వాడా చేయడంలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఆధార్ నంబరు ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం 2016లో బిల్లు (ఆధార్ యాక్ట్–2016)ను ఆమోదించిందని... దానిని ఇప్పటికే దేశంలోని 16రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు... కేంద్రం ఒత్తిడి మేరకు ఏపీలో కూడా దీనిని అమలు చేస్తున్నామని పేర్కొంటున్నారు. ప్రస్తుతం శాసనసభ సమావేశాలు లేనందున గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ జారీ చేసినట్లు తెలిపారు. ఆధార్ యాక్ట్–2016, దాని సవరణలకు అనుగుణంగా ఒక నిర్దిష్ట కొత్త చట్టం చేయనున్నట్లు ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. దీన్ని ఏపీ ఆధార్ ఆర్డినెన్స్–2023గా పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్స్ అమలులోకి వచ్చిన 3నెలల తర్వాత ఏయే పథకాలకు ఆధార్ తప్పనిసరో వివరిస్తూ జాబితాను ప్రకటిస్తామని తెలిపింది. ఆధార్ వివరాలు ఇవ్వడంపై లబ్ధిదారులకు ఎలాంటి అభ్యంతరాలున్నా చెల్లవని... ప్రభుత్వం, అధికారులు, ఉద్యోగులపై ఎలాంటి దావాలు, ప్రాసిక్యూషన్, ఇతర చట్టపరమైన చర్యలకు తావుండదని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఆధార్ లేనివారితో కొత్తగా నమోదు చేయించి... ఆ గుర్తింపుతో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తామని అధికారులు తెలిపారు.

# దుబ్బాక అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తున్న కొందరు నాయకులు

## –ఎమ్మెల్యే రఘునందన్ రావు

సిద్దిపేట జూలై 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : దుబ్బాక అభివృద్ధి విషయంలో కొందరు నాయకులు అడుగడుగునా ఆటంకాలు కల్పించడం బాధాకరమని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 2016లో సీఎం దుబ్బాకకు వచ్చినప్పుడు ఫైర్ స్టేషన్ కొరకు ఒక ఎకరం భూమి రైతు ఇస్తే ఇంతవరకు ఎలాంటి నిర్మాణం లేదని ఆవేదన చెందారు. సాక్షాత్తు సీఎం చెప్పిన మున్సిపల్ భవనానికి కూడా అతీగతీ లేదంటే అర్థం వీరి కపట ప్రేమ అర్థం చేసుకోవచ్చన్నారు. గజ్వేల్, సిద్దిపేటలో ఆగమేఘాల మీద భవనాలు నిర్మించారని.. దుబ్బాకలో ఎందుకు నిర్మించరని ప్రశ్నించారు. సిద్దిపేటలో విపంచి, గజ్వేల్‌లో మహతి ఆడిటోరియం ఎట్లా పూర్తి చేశారు?.. దుబ్బాకలో ఎందుకు చేయడం లేదని నిలదీశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు వచ్చి 16 నెలలు గడిచినా ఎలాంటి టౌన్ అభివృద్ధి చేస్తలేరు.. చేయనిస్తలేరని అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఐఓసీ భవనాలు పూర్తి అయిన దుబ్బాకలో ఇంకా కాలేదన్నారు. ప్రతి పక్షాలు ఉన్న చోట ఒక న్యాయం పాలక పక్షం ఉన్న చోట ఒక న్యాయం దురదృష్టకరమన్నారు.

# తణుకు సభ సాక్షిగా 'చింతిస్తున్నా.. క్షమించండి': పవన్ కల్యాణ్

తణుకు జూలై 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జనసేన అధినేత పవన్ కల్యాణ్ తణుకు సభ సాక్షిగా 'చింతిస్తున్నా.. క్షమించండి' అని కార్యకర్తలు, అభిమానులు, నేతల ముందే అడిగారు

. పవన్ కల్యాణ్ 'వారాహి' విజయ యాత్ర రెండో విడత శుక్రవారం నాడు పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో జరిగింది. ఈ సందర్భంగా సభ ప్రారంభం కాగానే.. జనసేన నేత విడివాడ రామచంద్రరావుకు క్షమాపణలు చెప్పారు. ' క్షమాపణలతో సభ ప్రారంభిద్దాం అనుకుంటున్నాను. ఆ క్షమాపణలు ఎవరికంటే విడివాడ రామచంద్రరావు ఆయన ఎంత బలమైన నాయకుడు అంటే నిన్న వీర మహిళలు, జనసేన కార్యకర్తల సభలో చెబితే నాకు సరిపోలేదు. అందుకే తణుకులో పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పుకుంటున్నాను. మీలాంటి నిలబడే నాయకుడి వెంట గత ఎన్నికల సమయంలో నేను నిలబడలేనందుకు మనస్ఫూర్తిగా చింతిస్తున్నాను. నేను టికెట్ ఇచ్చిన వ్యక్తి పార్టీ నుంచి వెళ్లిపోయారు. సీటు ఇవ్వని రామచంద్రరావు గారు పార్టీ కోసమే నిలబడ్డారు. ఇలాంటి వ్యక్తికి ధన్యవాదాలు చెబుతూ అందరి ముందు క్షమాపణలు కోరుతున్నాను' అని క్షమాపణలతోనే సభను ప్రారంభించారు పవన్. ఈ సందర్భంగా మరోసారి జగన్ సర్కార్‌పై తీవ్ర దుమారం రేపే వ్యాఖ్యలతో సేనాని విరుచుకుపడ్డారు. 'జగన్ రాజకీయ అవినీతిపై జనసేన పోరాటం చేస్తున్నది. జగన్ లంచగొండితనం మీద పోరాటం చేస్తున్నాను. స్థానిక మంత్రి కారుమూరి రైతులపై ఎలా విరుచుకుపడ్డాడో అందరికి తెలుసు. మద్దతు ధర కోసం పోరాడుతున్న దువ్వకి చెందిన 24 మంది రైతులపై కేసులు పెట్టావు. పోలవరం ఎలాగూ కట్టలేవు.. ఎర్రకాల్వ మరమ్మతుల కోసం రూ. 30 కోట్లు ఖర్చు చెయ్యి చాలు. కేంద్రం ఇచ్చిన రూ. 1100 కోట్ల విపత్తు నిధులను ఇతర పద్దులకు మళ్లించావు. సుప్రీంకోర్టు బయటపెడితేనే ఆ విషయం బయటపడింది. నువ్వు.. ప్రజల డబ్బు దొంగతనం చేస్తున్నావు.. అందుకే జగ్గూ భాయ్ అంటున్నాను. నీకు గళ్ల లుంగీ, పచ్చ చొక్కా వెయ్యాలి జగన్. గతంలో ఉన్న పథకాలకు పేర్లు మార్చి వాటిని అమలుచేస్తున్నావు. ఇంత నాటగాడివి.. ఎందుకు నవరత్నాలు పెట్టావు. ఉద్యోగుల పీఎఫ్ డబ్బులు తీసేసావు. కాగ్ ఆ విషయం అడిగితే.. సాంకేతిక తప్పిందం అన్నాడు. పీఎఫ్ దోచేసి, వారిని నిలువునా మోసం చేసావు. జగన్ అనుచరులు ఆయనను జగ్గూ భాయ్ అంటుంటే బాధపడిపోతున్నారు. నన్ను దత్తపుత్రుడుని, ప్యాకేజీ స్టార్ అని, పవన్ అని జగన్ అంటున్నాడు. అందుకే ఆయన్ను జగ్గూ భాయ్ అంటున్నాను. గిట్టుబాటు ధర రాలేదనే రైతులను ఎర్రిపప్ప అని వైసీపీ నాయకులు అంటున్నారు. మీరు ఏమైనా అనొచ్చు.. మేము అంటే తప్పా..? జగన్ గారు నుంచి జగ్గూ భాయ్ అనే స్థితికి జగన్ వచ్చాడు. ఇంకా నా మీద నోరు జారితే జగ్గూ అంటాను.. ఇంకా నోరు జారితే జగన్‌ను ఏమంటానో నాకు తెలీదు. మొలకలు వచ్చాయన్న రైతులనుఇక్కడ మంత్రి ఎర్రిపప్ప అంటాడు. ఎర్రిపప్ప అంటే అర్థం ఏమిటంటే బుజ్జి కన్నా అంటాడు. జగన్ జే ట్యాక్స్ వేస్తే.. తాడేపల్లిగూడెంలో 'కే' ట్యాక్స్.. తణుకులో ఎర్రిపప్ప ట్యాక్స్ వేస్తున్నారు. తాడేపల్లిలో ఒక బూతుల విశ్వవిద్యాలయం ఉంది. వారు చెప్పినట్లు వైసీపీ నాయకులు మాట్లాడితే, చూస్తూ ఊరుకోను' అని మంత్రిని, ముఖ్యమంత్రిని ఏకవచనంతోనే పవన్ మాట్లాడారు.

# దూరం ఒక్కటే.. రేట్లే అధికం.. ఆర్టీసీ ఎండీకి ప్రశ్న




హైదరాబాద్, జులై 15:ప్రయాణదూరం నాలుగు కిలోమీటర్లు, మెట్రో బస్సులో 30 రూపాయలు, పల్లె వెలుగులో పది రూపాయలు వసూలు చేస్తున్న ఆర్టీసీ, శంకర్పల్లి నుండి మోకిల నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. నాలుగు కిలోమీటర్ల దూరానికి మెట్రో బస్సులో 30 రూపాయలు వసూలు చేస్తే పల్లె వెలుగు బస్సుకు పది రూపాయలు వసూలు చేస్తున్నారు.

శంకర్పల్లి నుండి మహిదిపట్నం 34 కిలోమీటర్లు ఉంటుంది. టికెట్టు ధర 45 రూపాయలు అంటే నాలుగు కిలోమీటర్లకు 30 రూపాయలు, 34 కిలోమీటర్లకు 45 రూపాయలు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, ఉద్యోగులు మెట్రో బస్సులు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. 15నిమిషాలకు ఒకటి మెట్రో బస్సు ఉండగా, తక్కువ ధర వసూలు చేస్తున్న పల్లె వెలుగు బస్సులు రోజుకు నాలుగు మాత్రమే ఉంటాయి. ప్రయాణ దూరం ఒక్కటే కానీ, టికెట్టు ధరలో ఉన్న భారీ వ్యత్యాసాన్ని సరిచేయాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ను ప్రయాణికులు కోరుతున్న పరిస్థితి నెలకొంది.

# భారత్, ఫ్రాన్స్ సంబంధాల్లో మహా విప్లవం



పారిస్ జూలై 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : భారత్–ఫ్రాన్స్ సంబంధాల్లో శుక్రవారం విప్లవాత్మక పరిణామం జరిగింది. ఇరు దేశాల ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతమయ్యే విధంగా యుద్ధ విమానం ఇంజిన్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేయబోతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఎమ్మాన్యుయేల్ మేక్రన్ ద్వైపాక్షిక చర్చల అనంతరం దీనికి సంబంధించిన ప్రకటన వెలువడింది. భారత్–ఫ్రాన్స్ సంయుక్తంగా యుద్ధ విమానం ఇంజిన్‌ను అభివృద్ధి చేయడం కోసం ఫ్రెంచ్ ఏవియేషన్ కంపెనీ సాఫ్రాన్, భారత దేశానికి చెందిన రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఈ ఏడాది చివరిలోగా ఓ ప్రణాళికను రూపొందిస్తాయి. ఇండియన్ మల్టీ రోల్ హెలికాప్టర్ ప్రోగ్రామ్ లో భాగంగా ఫ్రాన్స్‌లోని సాఫ్రాన్ హెలికాప్టర్ ఇంజిన్‌తో కలిసి హెవీ లిఫ్ట్ హెలికాప్టర్స్ మోటరైజేషన్ కోసం పారిశ్రామిక సహకారాన్ని ఇరు దేశాలు పెంపొందించుకుంటాయి. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఫ్రాన్స్‌లోని సాఫ్రాన్ హెలికాప్టర్ ఇంజిన్ మధ్య ఒప్పందం కుదిరింది. భారత్–ఫ్రాన్స్ మధ్య ఉన్న పరస్పర నమ్మకం స్ఫూర్తితో ఈ వెంచర్స్‌ను కుదుర్చుకున్నట్లు ఈ ప్రకటనలో తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం బదిలీలో ఇండో–ఫ్రాన్స్ అనుభవం ఆధారంగా క్రిటికల్ కాంపొనెంట్స్, టెక్నాలజీ బిల్డింగ్ బ్లాక్స్‌ను పంచుకోవడం, ఉమ్మడిగా అభివృద్ధి చేయడంలో ఇరు దేశాలకు పరస్పర విశ్వాసం ఉన్నట్లు తెలిపింది. భారత దేశం 26 రఫేల్–ఎం నావల్ ఫైటర్ జెట్స్ కొనడం గురించి ఈ డాక్యుమెంట్‌లో వెల్లడించలేదు. కానీ భారత వైమానిక దళం కోసం భారత దేశం కొనుగోలు చేసిన 36 రఫేల్ యుద్ధ విమానాలను సకాలంలో భారత దేశానికి అందించడం గురించి మాత్రమే తెలిపింది. మేక్రన్‌తో సంయుక్త మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు మూల స్తంభం రక్షణ సంబంధాలేనని చెప్పారు. పరస్పర నమ్మకానికి ఇది చిహ్నమని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్వయంసమృద్ధ భారత దేశం' కార్యక్రమాల్లో ముఖ్యమైన భాగస్వామి ఫ్రాన్స్ అని తెలిపారు. జలాంతర్గాములైనా, నావికా దళ విమానాలైనా, తాము కలిసికట్టుగా అభివృద్ధి చేసి, అందుబాటులోకి తీసుకురావాలనుకుంటున్నామని, కేవలం తమ అవసరాలు మాత్రమే కాకుండా మిత్ర దేశాల అవసరాలను కూడా తీర్చాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్–ఫ్రాన్స్ కలిసికట్టుగా పని చేస్తున్నాయన్నారు. క్రాస్ బోర్డర్ టెర్రరిజంపై కఠినంగా వ్యవహరించాలని తాము బలంగా విశ్వసిస్తున్నామన్నారు. భారత దేశ యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్‌ను ఫ్రాన్స్‌లో ప్రారంభించడానికి ఇరు దేశాలు అంగీకరించాయన్నారు. మర్సీల్లీస్ నగరంలో కొత్తగా భారత కాన్సులేట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. మోదీ ఈ నెల 13, 14 తేదీల్లో ఫ్రాన్స్‌లో పర్యటించారు. మోదీ, మేక్రన్ చర్చల అనంతరం సెల్ఫీ తీసుకున్నారు. ఈ ఫొటోను మేక్రన్ ట్వీట్ చేశారు. దీనికి కేప్షన్‌ను ఫ్రెంచ్, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఇచ్చారు. "భారత్–ఫ్రెంచ్ భాగస్వామ్యం కలకాలం వర్ధిల్లాలి" అని శీర్షికను రాశారు. మోదీ దీనిని రీట్వీట్ చేసి, "ఎప్పటికీ స్నేహితులమే" అని తెలిపారు. మోదీ శుక్రవారం ఫ్రాన్స్ బాస్టిల్లే డే ఉత్సవాల్లో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. భారతీయ త్రివిధ దళాలు, భారత వాయు సేనకు చెందిన రఫేల్ ఫైటర్ జెట్స్ కూడా ఈ కవాతులో పాల్గొన్నాయి. మోదీకి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ ఆనర్‌ను ప్రదానం చేశారు.

# నైపుణ్యంతో కూడిన ఉన్నత విద్య తక్షణ అవసరం

## –ఆచార్య సిహెచ్ గోపాల్ రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ విసి



హైదరాబాద్, జులై 15:ఆధునిక డిజిటల్ యుగంలో పాఠ్యాంశాల్లో పట్టు సాధిస్తూనే ఆయా రంగాల్లో ప్రయోగశాల, కంప్యూటర్ నైపుణ్యాలు కనీస అర్హతలు అయ్యాయని నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఉపకులపతి, శాతవాహన ఇన్‌చార్జ్ విసి ప్రొఫెయర్ సిహెచ్ గోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ రోజు శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతిని కలిసిన కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి, డా ఏ లక్ష్మారెడ్డిలు పలు అంశాలపై చర్చించడం జరిగింది. విశ్వవిద్యాలయ విద్యకు దినదినం ఆదరణ తగ్గుతున్నదని, విద్యార్థులు చేస్తున్న యువతలో, బోధనా సిబ్బందిలో అంకితభావం లోపిస్తున్నదని విచారం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలు పరిశోధనలకు పెద్ద పూట వేయాలని, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన బోధన సిబ్బంది కొరత, కనీస అవసరాల కల్పనలో ఉదాసీనత, మౌలిక వనరుల లేమి లాంటి పలు రంగాల్లో సమస్యలను పరిష్కరించాలని డా బుర్ర మధుసూదన్ రెడ్డి, డా ఏ లక్ష్మారెడ్డిలు కోరారు. ఈ సందర్భంగా విసి ఆచార్య గోపాల్ రెడ్డిని కరీంనగర్ విద్యావంతుల పక్షాల కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, డా ఏ లక్ష్మారెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంతో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వర ప్రసాదు తదితరులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బోనాల వేడుకలలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

హైదరాబాద్, జులై 15:మన్సూరాబాద్ డివిజన్ పరిధి ప్రభుత్వ పాఠశాల సమీపంలోని శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయం లో కాటమయ్యా బోనాల ఉత్సవాలను గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు . అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాటమయ్యా స్వామి అనుగ్రహం ఎల్లప్పుడూ అందరిమీద ఉండాలని కోరారు .బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి శ్రీధర్ గౌడ్ ముద్ద కళ్యాణ్,సభ్యులు శ్రీధర్ గౌడ్,మల్లేష్ గౌడ్,శ్రీనివాస్,జగదీష్,నరేష్,రాజేందర్,నర్సింహాగౌడ్,జైరాజ్ పాల్గొన్నారు.



# బోడుప్పల్ పాలక మండలి సమావేశం - అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయింపు



హైదరాబాద్, జులై 15:బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సాధారణ సర్వ సభ్య సమావేశం మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పారిశుద్ధ్య కార్మికులకు 1000 వేతనం పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు అమలుపై చర్చించారు. కుక్కల బెడద నుండి రక్షణ కల్పించుటకు వాక్సినేషన్ కొరకు 16,50,000/- కేటాయించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023-24 కొరకు 10 లక్షలు కేటాయించారు. పారిశుధ్య విభాగంలో అవసరమైన సామాగ్రి కొరకు 35 లక్షలు కేటాయించారు. ప్రతి డివిజన్ అభివృద్ధి కొరకు 20 లక్షల చొప్పున కేటాయించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద మరమ్మత్తుల గురించి 10 లక్షలు, రా చెరువు వద్ద చట్ పూజ నిర్వహించుటకు 30 లక్షలు, మరో 10 కొత్త క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు 50 లక్షలు నిధులు కేటాయించారు.

TSSPDCL వారికి 50 లక్షలు చెల్లింపులు మరియు ఊఓచిూాః వారికి నీటి సరఫరా మరియు లీకేజి నిర్వహణ కొరకు 135 లక్షలు కేటాయించారు. 2 కోట్ల ప్రభుత్వ నిధులతో దోబీ ఘాట్ నిర్మాణం కొరకు కౌన్సిల్ అనుమతి కొరకు ముందు ఉంచారు. రాబోయే బోనాల పండుగకు ఆలయాల అలంకరణకు 8 లక్షలు కేటాయించారు. 15వ డివిజన్ లో గౌరవ కార్మికశాఖామంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి ఆదేశానుసారం లక్ష్మారెడ్డి కాలనీ యందు 24.50 లక్షలతో డ్రైనేజి కొరకు నిధులు కేటాయించారు. మరికొన్ని ఇతర అంశాలను కౌన్సిల్ ఆమోదించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్ గారు, కమిషనర్ ఉ. వేణు గోపాల రెడ్డి గారు, కార్పొరేటర్లు, కో అప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# జూలై 17న మూడవ ఎడిషన్‌ను విడుదల చేయనున్న నీతి ఆయోగ్ 2022

న్యూఢిల్లీ, జులై 15:2022 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రపంచ వాణిజ్యం నేపథ్యంలో భారతదేశం యొక్క ఎగుమతి పనితీరును ఈ నివేదిక చర్చిస్తుంది. అంతేకాకుండా ఆయా రంగాల వారీగా

దేశం యొక్క ఎగుమతి పనితీరును అవలోకనం చేస్తుంది. దేశంలో ఎగుమతి కేంద్రాలుగా మన జిల్లాలను అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని నివేదిక మరింత నొక్కి చెబుతోంది. అంతేకాకుండా దేశంలోని సరుకుల ఎగుమతులపై జిల్లా స్థాయి విశ్లేషణను కూడా ఈ నివేదిక చేపట్టింది.

ఈపీఐ అనేది భారతదేశంలోని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల ఎగుమతి సంసిద్ధతను కొలిచే ఒక సమగ్ర సాధనం. దేశంలో ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధిని అనుకరించడానికి ఎగుమతులు చాలా ముఖ్యమైనవి, ఇందుకోసం ఎగుమతి పనితీరును ప్రభావితం చేసే అంశాలను అర్థం చేసుకోవడం అవసరం. రాష్ట్రాలు మరియు యుటిల బలాలు మరియు బలహీనతలను గుర్తించడానికి ఎగుమతి- సంబంధిత పారామితులలో విషయసూచిక సమగ్ర విశ్లేషణను చేపట్టింది. ఇండెక్స్ కోసం మెథడాలజీని అభివృద్ధి చేయడం అనేది ఒక అభివృద్ధి చెందుతున్న ప్రక్రియ, ఇది వాటాదారుల అభిప్రాయాన్ని నిరంతరం కలుపుతుంది. అందువల్ల, ఈ ఎడిషన్‌లో ప్రచురించబడిన ఫలితాలు మరియు ర్యాంకింగ్‌లు మునుపటి ఎడిషన్‌లతో నేరుగా పోల్చదగినవి కావు, అయితే ఈపీఐ, దాని అంతర దృష్టులతో, రాష్ట్రాలు మరియు కేంద్రాపాలిత ప్రాంతాలు వారి నిర్దిష్ట సవాళ్లను పరిష్కరించడానికి సంబంధించిన డ్రైవింగ్ పాలసీ మార్పులలో సహాయం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంది.

ఈపీఐ బిజినెస్ ఎకో సిస్టమ్, ఎక్స్పోర్ట్ ఎకోసిస్టమ్, ఎగుమతి పనితీరుతో నాలుగు స్తంభాల విధానంలో రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేస్తుంది. ప్రతి స్తంభం.. ఉప స్తంభాలతో కూడి ఉంటుంది. ఇది సంబంధిత సూచికలను ఉపయోగించి రాష్ట్ర పనితీరును సంగ్రహిస్తుంది.

పాలసీ పిల్లర్ రాష్ట్రాలు, జిల్లా స్థాయిలో ఎగుమతి సంబంధిత పాలసీ ఎకో సిస్టమ్ను స్వీకరించడంతోపాటు ఎకో సిస్టమ్ చుట్టూ ఉన్న ఇన్స్టిట్యూషనల్ ఫ్రేమ్ వర్క్ ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును పాలసీ పిల్లర్ అంచనా వేస్తుంది.

బిజినెస్ ఎకోసిస్టమ్ వ్యాపార -సహాయక మౌలిక సదుపాయాల పరిధి మరియు రాష్ట్రం/ కేంద్ర పాలిత ప్రాంతాల రవాణా కనెక్టివిటీతో పాటు రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రబలంగా ఉన్న వ్యాపార వాతావరణాన్ని అంచనా వేస్తుంది.

ఎక్స్పోర్ట్ ఎకో సిస్టమ్ ఎగుమతిదారులకు అందించబడిన వాణిజ్య మద్దతుతో పాటు రాష్ట్రం/ కేంద్ర పాలిత ప్రాంతాలలో ఎగుమతి సంబంధిత మౌలిక సదుపాయాలపై దృష్టి పెడుతుంది. అంతేకాకుండా ఆవిష్కరణను ప్రోత్సహించడానికి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతాలలో పరిశోధన మరియు అభివృద్ధి యొక్క ప్రాబల్యం పెంచుతుంది.

ఎగుమతి పనితీరు అనేది ఒక అవుట్‌పుట్-ఆధారిత సూచిక. ఇది గత సంవత్సరం కంటే రాష్ట్ర ఎగుమతి వృద్ధిని అంచనా వేస్తుంది. అంతేకాకుండా ప్రపంచ మార్కెట్‌లలో దాని ఎగుమతి లక్ష్యాలను, ప్రధాన అంశాలను విశ్లేషిస్తుంది.

నివేదికను నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ విడుదల చేస్తారు

ఈ ర్యాంకులు, స్కోర్ కార్డులతో రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల ఎగుమతి సంసిద్ధత యొక్క సమగ్ర చిత్రాన్ని ప్రదర్శించడాన్ని ఈ నివేదిక లక్ష్యంగా పెట్టుకుంది.

ఇది రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల విజయాలను కూడా హైలైట్ చేస్తుంది. అంతేకాకుండా పోటీ సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టడానికి రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య పీర్-లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తుంది. రాష్ట్రాల మధ్య మరియు రాష్ట్ర మరియు కేంద్రం మధ్య సహకారాన్ని మెరుగుపరచడం ద్వారా, భారతదేశం స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించాలని మరియు జాతీయ మరియు ఉప-జాతీయ స్థాయిలలో అభివృద్ధిని పెంపొందించడానికి దాని వైవిధ్యతను ఉపయోగించుకోవాలని ఆకాంక్షిస్తుంది.

# బోనమెత్తిన స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు

## - బోనాలతోకనువిందుచేసినచిన్నారులు, మహిళాటీచర్లు
## - పోతురాజువిన్యాసాలతో నేత్రపర్వంగాబోనాల ఊరేగింపు




ఖమ్మం, జులై 15: (నేటినిజం ప్రతినిధి): బోనాలతో, పోతురాజుల విన్యాసాలతో స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు శనివారం కనువిందు చేశారు. తెలంగాణ సంస్కృతిలో ప్రధాన ఘట్టమైన బోనాల వేడుకను స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో నేత్రపర్వంగా నిర్వహించారు. సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు తమ తమ గృహాలనుంచి సాంప్రదాయబద్ధంగా అలంకరించిన బోనాలను స్మార్ట్ కిడ్జ్ పాఠశాలకు తీసుకొని వచ్చారు. పాఠశాలలో బోనాలకు సాంప్రదాయకరంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలను నెత్తిన పెట్టుకున్న చిన్నారులు, మహిళా టీచర్లు నగరపురవీధుల్లో బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతురాజు విన్యాసాలు , డప్పు దరువులతో ఈ ఊరేగింపు నేత్ర పర్వంగా జరిగింది. చిన్నారులతోపాటు పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్ రాణి, మహిళా టీచర్లు బోనాలతో ఈ ఊరేగింపులో భాగస్వాములయ్యారు. సమీపంలోని దేవాలయంలో బోనాలతో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రపంచంలోనే తెలంగాణ బోనాల వేడుకలకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. తరతరాలుగా మన తెలంగాణలో బోనాల వేడుకలు ప్రాచీన కాలం నుంచి ఇంటింటా నిర్వహించటం జరుగుతుందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల సంబరాలు ప్రతికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బోనాల సంబరాల ప్రాధాన్యతను తెలియజేయడానికి తమ పాఠశాలలో బోనాల ఉత్సవాన్ని నిర్వహించామన్నారు. అన్ని మతాల, సాంప్రదాయాల విశిష్టతను తమ పాఠశాలలో విద్యార్థులకు తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతున్నామని కృష్ణ చైతన్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ రాణి, మహిళా టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం పట్టివేత.. వాహనాల సీజ్.. ఇద్దరు అరెస్ట్



అమరావతి, జులై 15: కర్ణాటక అక్రమ మద్యం తరలిస్తున్న వాహనాలతో పాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు గంగవరం పోలీసు స్టేషన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం నుండి రెండు కార్లలో అక్రమమద్యంతో వస్తున్న వాహనాలను మండలంలోని కేటిల్ ఫారం వద్ద గంగవరం సి.ఐ.అశోక్ కుమార్, ఎస్.ఐ.ప్రతాప్ రెడ్డి సారథ్యంలో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొనే సందర్భంగా ఈ వాహనాలతో వస్తున్న మరో నిందితుడు ద్విచక్ర వాహనం వదిలేసి పారిపోయాడు.

ఈమేరకు శనివారం పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్టు చూపారు. ఇందులో నిందితులు ముగ్గురిలో బైరెడ్డిపల్లె మండలానికి చెందిన చరణ్ కుమార్, లోకేష్ లను అరెస్టు చేయగా.. పారిపోయిన హరీష్ కర్ణాటకలోని తాయలూరు వైన్ షాప్ ఓనర్ మధు, మైక్ విఘ్నేష్ లపై మొత్తం ఐదుమందిపై కేసు నమోదు చేశామని, పట్టుబడిన మద్యం, వాహనాల విలువ రూ. 5లక్షలు, పట్టుబడిన రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం రూ. 7లక్షలు, మొత్తం వాటి విలువ 12లక్షల రూపాయలు ఉన్నట్లు ఆయన వివరించారు.

# ఆ ఎర్ర చందనం తీసుకొచ్చి అమ్మేందుకు ప్రత్యేక కృషి - మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి, జులై 15:దేశవ్యాప్తం పట్టుబడిన ఎర్ర చందనం దుంగలను రాష్ట్రానికి తీసుకు రావడానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని, అలా తెచ్చిన దుంగలను విక్రయించి వచ్చే సొమ్ములో ఆయా రాష్ట్రాలకు వాటా ఇస్తామని

రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. స్థానిక కరకంబాడి రోడ్డులోని ప్రైవేటు హోటల్లో ఈ రోజు సాయంత్రం ఎర్ర చందనం స్మగ్లింగ్ పై అనుసరించాల్సిన వ్యూహాలపై వివిధ రాష్ట్రాల అటవీ శాఖ పి. సి.సి.ఎఫ్ లతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ఎర్ర చందనం శేషాచలం అడవుల్లో మాత్రమే ఉందన్నారు. దేశంలో ఎక్కడ ఎర్ర చందనం పట్టుబడిన ఒకే ప్రాంతంకు సంబందించినదేనని చెబుతూ ఆ ఎర్రచందనాన్ని ఏపికి తీసుకువచ్చే విధంగా చర్యలు చెప్పాడుతున్నామని అన్నారు. ఆయా ప్రాంతంలో పట్టుబడిన దుంగలను రాష్ట్రానికి తెప్పించి వేలం వేస్తామన్నారు, తద్వారా వచ్చే ఆదాయంలో ఆయా రాష్ట్రలకు వాటా ఇస్తామని చెప్పారు. రాష్ట్రాలకు కస్టమ్స్, డి.ఆర్.ఐ లకు వాటా ఉంటుందని, తద్వారా ఎర్ర చందనం ద్వారా రాష్ట్రానికి ఆర్థికంగా మరింత ప్రయోజనం, ఆదాయం లభిస్తుందని అన్నారు.

ఈ కార్యకలాపాలను ఒక నోడల్ ఏజెన్సీ కిందకు తీసుకు వచ్చేలా చర్యలు చేపట్ట డానికి ఒక కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ స్పెషల్ సెక్రటరీ చంద్ర ప్రకాష్ గోయల్ పాల్గొన్న సమావేశంలో ఎర్రచందనం పరిరక్షణకు తీసుకోవాల్సినచర్యలు, మార్గదర్శకాలు పై చర్చించారు.

# విజయవాడ డివిజన్‌లో 23వ తేది వరకు పలు రైళ్లు రద్దు..

అమరావతి, జులై 15: విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు మార్గాల్లో రైళ్లను రద్దు చేసింది. ఈ నెల 17 నుంచి 23 వరకు కాకినాడ నుంచి విశాఖకు వెళ్లే ప్యాసింజర్ స్పెషల్ రైలు, రాజమండ్రి నుంచి విశాఖ ప్యాసింజర్, ఈ నెల 23 వరకు విశాఖ నుంచి విజయవాడకు వచ్చే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు వెల్లడించారు.

ఈ నెల 18, 21, 22న ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ రైలును,ఈ నెల 21న టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారిని మళ్లిస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు రైళ్ల రద్దు, దారి మళ్లింపును గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

# నేర నిర్ధారణకు సీసీ కెమెరాలు : వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి..

హైదరాబాద్, జులై 15: నేర నిర్ధారణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపారు. వనస్థలిపురం స్టేషన్ పరిధిలోని విజయ శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ పురుషోత్తం రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కాలనీలలో జరిగే ప్రతి సంఘటనలు రికార్డ్ అయి ఉండటమే కాకుండా, నేరస్తులను సులువుగా గుర్తించేఅవకాశముంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐ దేప జలంధర్ రెడ్డి, డిఐ వెంకట్, అడ్మిన్ ఎస్ఐ వీరస్వామి గౌడ్ ,ఎస్ ఐ మాధవరెడ్డి విజయ శ్రీ కాలనీ అధ్యక్షులు జొన్నాడ మోహన్ రెడ్డి ,కార్యదర్శి మార్గం రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

# కూల్‌డ్రింక్స్ తాగితే క్యాన్సర్ వస్తుంది: ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి..

న్యూఢిల్లీ, జూలై 15 కూల్‌డ్రింక్స్ తాగితే క్యాన్సర్ వస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. చక్కెరకు బదులుగా శీతల పానీయాల్లో వినియోగించే స్వీట్నర్ పదార్థం అస్పర్టేమ్ క్యాన్సర్ కారకమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చిచెప్పింది. కానీ ఇది వరకే వైద్య నిపుణులు ఆమోదించిన మోతాదులో తీసుకుంటే ఎటువంటి ప్రమాదం లేదని వెల్లడించింది. కోకాకోలా, డైట్ కోక్, సోడా, చూయింగ్ గమ్‌లలో వినియోగించే అస్పర్టేమ్ ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు చెందిన రెండు సంస్థలు శుక్రవారం నివేదికను వెలువరించాయి. ఫ్రాన్స్‌లోని లైయన్ వేదికగా పని చేస్తున్న అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్సీ), జెనీవా కేంద్రంగా పని చేస్తున్న డబ్ల్యూహెచ్‌వో ఫుడ్, అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ జాయింట్ కమిటీ ఆన్ ఫుడ్ అడిటివ్స్ (జేఈసీఎఫ్ఏ) దీనిపై పరిశోధనలు చేశాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన న్యూట్రిషన్ హెడ్ ఫ్రాన్సెస్కో బ్రాన్కా ఈ అధ్యయన నివేదికను శుక్రవారం విడుదల చేశారు. పానీయాలను ఎంపిక చేసుకునే వినియోగదారులు అస్పర్టేమ్ లేదా స్వీట్నర్లను పరిగణనలోకి తీసుకోవద్దని సూచించారు. స్వీట్నర్ లేదా అస్పర్టేమ్ కలిపిన శీతల పానీయాల్లో దేన్ని తాగాలని వినియోగదారులు సంశయిస్తుంటారు. ఆ రెండింటి బదులు నీరు తాగాలని వినియోగదారులకు సూచిస్తున్నా' అని ఆయన తెలిపారు. తొలుత అస్పర్టేమ్ క్యాన్సర్ కారకమని శుక్రవారం ఐఏఆర్సీ ప్రకటించింది.

'అమెరికా, యూరప్‌లో గతంలో మూడు అధ్యయనాలు చేశాం. అస్పర్టేమ్ వినియోగం వల్ల హెపాటోసెల్లర్ కార్సినోమా అనే కాలేయ సంబంధిత క్యాన్సర్ వస్తుంది. గతంలో 2016లోనే దీనిపై వినియోగదారులకు సూచించాం. అస్పర్టేమ్ క్యాన్సర్ కారకమేనని తాము వెలువరించిన నివేదికలు వివాదాస్పదంగా మారుతున్నాయి. అస్పర్టేమ్‌లో క్యాన్సర్‌కు కారకమవుతున్న రసాయనాలు ఉన్నాయనడానికి పరిమిత సంఖ్యలో ఆధారాలు ఉండటమే దీనికి కారణం. గతంలో జంతువులపై చేసిన అధ్యయనంలోనూ అస్పర్టేమ్ క్యాన్సర్ కారకమేనని తేలింది' అని ఐఏఆర్సీ పేర్కొంది. అస్పర్టేమ్ క్యాన్సర్ కారకమో కాదో తేల్చి చెప్పడానికి దీనికి సంబంధించిన నిపుణులకు తమ నివేదిక ఓ పిలుపులాంటిదని ఐఏఆర్సీ చీఫ్ మేరీ షూబర్ బెరిగాన్ తెలిపారు.

రోజుకు 40 ఎంజీ/కిలో?

జేఈసీఎఫ్ఏ దీనిపై మరోలా నివేదికను వెలువరించింది. అస్పర్టేమ్ క్యాన్సర్‌కు కారకమవుతున్నదనటానికి సరైన ఆధారాలు లేవని తెలిపింది. నిపుణులు ఆమోదించిన మోతాదులో అస్పర్టేమ్ తీసుకుంటే ప్రమాదం ఉండదని పేర్కొంది. రోజుకు 40 ఎంజీ/కిలో అస్పర్టేమ్ తీసుకుంటే ప్రమాదమేమీ కాదని చెప్పింది.

# మిషన్ భగీరథ పనులను త్వరగా పూర్తి చేయండి.. ప్రభుత్వ విప్ బాల్క సుమన్



కరీంనగర్, జులై 15: మిషన్ భగీరథ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, చెన్నూరు శాసనసభ్యులు బాల్క సుమన్ ఆదేశించారు. శనివారం మంచిర్యాల ఐడిఓసి కలెక్టరేట్ కార్యాలయంలో చెన్నూర్ నియోజకవర్గంలోని మిషన్ భగీరథ పనులపై జిల్లా కలెక్టర్ బధావత్ సంతోష్, మిషన్ భగీరథ ఈఎన్ సి కృపాకర్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన మిషన్ భగీరథ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జ్ఞాన్ కుమార్, అంజన్ రావు, మధుసూదన్, ప్రకాష్ లతో పాటు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, నియోజకవర్గంలోని జడ్పిటీసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, ఏజెన్సీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మూర్ఛ రోగికి కామినేని వైద్యుల కొత్త జీవితం

హైదరాబాద్, జులై 15:హైదరాబాద్ లోని ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో ఆధునాతన న్యూరో సైన్ సేవలతో ప్రముఖ న్యూరో సర్జన్లు సూర్యాపేటకు చెందిన విజయ అనే మహిళకు అవేక్ క్రానియోటమి పక్రియను విజయవంతంగా ముగించి కొత్త జీవితాన్ని అందించారు. కామినేని ఆసుపత్రి ఆవరణలో నేడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కామినేని ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ రవేష్ మాట్లాడుతూ విజయ అనే మహిళకు మూర్ఛ రావడంతో ఆసుపత్రిలో చేర్పించారన్నారు.

పరీక్షల ద్వారా మెదడు లోని ఎడమ మోటారు ప్రాంతంలో పెద్ద గాయం ఉన్నట్లు నిర్ధారించామన్నారు. శస్త్ర చికిత్స అధిక ప్రమాదంతో కూడుకున్నది అయినప్పటికీ , అత్యాధునిక సాంకేతిక ప్రజ్ఞానంతో కూడిన అధునాతన న్యూరో సైన్స్ లభ్యతతో చికిత్స చేసి సానుకూల ఫలితం సాధించినట్లు తెలిపారు.




# అమ్మలగన్న అమ్మకు 'బోనమిద్దాం' రారండమ్మా రారండి:



## ప్రస్తావన :

బోనమ్ అంటే తెలుగులో భోజనం అని అర్థం. గ్రామదేవతలకు భక్తులు సమర్పించే నైవేద్యం. ఈ నైవేద్యాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో, బహు నిష్టతో ఆషాడ మాసంలో గ్రామ దేవతలను పూజించే సాంప్రదాయంగా తెలంగాణలోని జంట నగరాలు హైదరాబాద్, సికింద్రాబాద్ లోను , రాయలసీమ లోని కొన్ని ప్రాంతాలలో నివసించే హిందువుల అతిపెద్ద పండుగ 'బోనాలు' పండుగ. వర్షాలు మొదలయ్యే సమయంలో తెలంగాణలోని జంట నగరాలలో మాత్రమే కాకుండా తెలంగాణాలోని ఇతర ప్రాంతాలలోను ప్రతి ఆదివారం ఒకొక్క ప్రదేశంలో బోనాల జాతర జరుపుకుంటారు. 1869లో జంట నగరాలలో ప్లేగు వ్యాధి వ్యాపించినప్పుడు, ఆనాడు గ్రామ ప్రజలు దేవత ఆగ్రహానికి గురయ్యామని తలంచి, గ్రామ దేవతలు ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, పోలేరమ్మ, అంకాలమ్మ, మారమ్మ, మహంకాళి మొదలైన పలు పేర్లతో విధీవిధీలో కొలువై యున్న అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తామని వేడుకోవడం, భోనం నైవేద్యం సమర్పిస్తూ వస్తున్న ఆచారం. అమ్మవారి ఆలయాలలో దేవతలకు భక్తులు సమర్పించే నైవేద్యమే బోనాలు.

## పండుగ ఉత్సవం ప్రారంభం:

ఈ ఉత్సవం ముందుగా గోల్కొండలో కొలువై ఉన్న మహంకాళీ దేవాలయంలో ప్రారంభమై, సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి దేవాలయం, హైదరాబాద్ పాతబస్తీలోని 'షాలిబండ'లో కొలువై ఉన్న అక్కన-మాదన్న మహంకాళీ దేవాలయం, 'లాల్‌దర్వాజ' లోని మహాంకాళీ అమ్మవారి దేవాలయం'మొదలైన పలు ప్రధాన దేవాలయాలలో వరుసగా తెలంగాణా ప్రాంతం అంతా కనుల పండుగగా జరుపుకోవడం ఆనవాయితీ. గోల్కొండను పాలించిన తానీషా కాలములో అక్కన్న-మాదన్న అనబడే సోదరుల వల్ల 1815లో కట్టబడింది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ ఆలయం కట్టబడినట్లుగా చరిత్ర లో చెప్పబడుతుంది. ఈ ఏడాది బోనాల ఉత్సవం హైదరాబాద్ ఉజ్జయిని మహాంకాళి ఆలయంలో జూలై పది నుండి జూలై ముప్పైదాకా జరుపబడుతుంది. ఇది తెలంగాణా ప్రజల అసలైన తెలుగు పండుగ. జంటనగరాల ప్రజలు మాత్రమే కాకుండా ప్రక్కన ఉన్న తెలంగాణా ప్రాంతాలకు చెందిన లక్షలాదిమంది ఈ ఉత్సవంలో పాల్గొంటారు. వేరు వేరు ప్రాంతాలనుండి వచ్చేవారు రకరకాలైన ఉయ్యాలలను తయారుచేసి తెచ్చి అమ్మవారికి సమర్పిస్తారు.

## బోనాల పండుగ :

బోనాలు : భోజనం ప్రకృతి. బోనం వికృతి. బోనం అంటే భోజనం. జానపదులు తమకు ఇష్టమైన గ్రామదేవతలకు సమర్పించే నైవేద్యమే బోనం. దీన్ని కొత్తకుండలో వండి ప్రదర్శనగా వెళ్లి గ్రామదేవతలకు భక్తిప్రపత్తులతో సమర్పిస్తారు. చిన్నముంతలో పానకం పోస్తారు. దానిపై దివ్వే పెట్టి బోనంజ్యోతి వెలిగించి జాతర కన్నులపండుగా నిర్వహిస్తారు. వేటపోతు మెడలో వేపమండలుకట్టివ్యాధి నిరోధకశక్తిని పెంచే పసుపు కలిపిన నీరు, వేపాకుల్ని చల్లుకుంటూ భక్తులు ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు తరలివెళ్లి బోనాలు సమర్పిస్తారు. ఇలా బోనాల సమర్పణ వల్ల దేవతలు శాంతించి అంటువ్యాధులు రాకుండా కాపాడుతారని ప్రజల విశ్వాసం.

ఉత్సవం ముందుగా గోల్కొండలో కొలువై ఉన్న మహంకాళీ దేవాలయంలో ప్రారంభమై, సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి దేవాలయం, హైదరాబాద్ పాతబస్తీలోని 'షాలిబండ'లో కొలువై ఉన్న అక్కన-మాదన్న మహంకాళీ దేవాయం, 'లాల్‌దర్వాజ' లోని మహాంకాళీ అమ్మవారి దేవాలయం'మొదలైన పలు ప్రధాన దేవాలయాలలో వరుసగా కనుల పండుగగా జరుగుతుంది.

బోనాల పండుగఘటం, బోనాలు, వేపాకు సమర్పించుట, ఫలహారంబండి, పోతురాజు విన్యాసం, రంగం, బలి, సాగనంపుట అని ఎనిమిది అంగాలతో కూడినది.

1.ఘటోత్సవం: ప్రత్యేకమైన కలశంలో అమ్మవారిని ఆవాహనచేసి, నగరవీధులగుండా ఉరేగింపుగా తీసుకెళతారు. బోనాల ఉత్సవం



ప్రారంభించిన మొదటి రోజునుండి పదునాల్గవ రోజుదాకా ప్రతిరోజు ప్రొద్దున, సాయంకాలం అమ్మవారు కలశంలో సూక్ష్మరూపంగా ఆసీనురాలై, నగర, గ్రామ వీధులో ఊరేగి, భక్తుల పూజలను స్వీకరిస్తుంది. 'ఘటం' అంటే 'కలశం'. అమ్మవారి రూపం కలశం మీద గీయబడుతుంది. ఆ ఘటం అమ్మవారిలాగే అలంకరించబడుతుంది. ఆలయ పూజారి శరీరమంతా పసుపు పూసుకుని ఘటాన్ని మోసుకెళతాడు.

2.బోనాలు: శక్తి స్వరూపిణియైన మహంకాళికి భక్తితో సమర్పించే అన్నమే 'బోనాలు'. ఎవరివారు ఏఏ రకంగా వండి నైవేద్యం పెడతామని మ్రొక్కుకున్నారో, ఆవిధంగా వండి సమర్పించి తమ కృతజ్ఞతను తెలుపుకోవటం ఆచారంగా ఉన్నది. చక్కెరపొంగలి, బెల్లపు పొంగలి, కట్టెపొంగలి, పసుపుఅన్నం, అని పలురకాలుగా బోనాలు అన్నం ఉంటుంది.ఆషాఢ జాతరలో పదిహేనవరోజు, స్త్రీలు తమ ఇళ్ళను కడిగి శుభ్రపరచి, తలంటుకుని సాన్నంచేసి, శుభ్రమైన కొత్తబట్టలు ధరించి, వ్రతం ఆచరించి నైవేద్యం తయారు చేస్తారు. చక్కగా అలంకరించిన ఒకపాత్రలో అన్నాన్ని ఉంచి, వేపాకులతో చుట్టూకట్టి, దానిమీద మూతపెట్టి, మూతమీద పవిత్రంగా దీపం వెలిగించి, తలమీద పెట్టుకునివచ్చి లక్షలాది మంది ఆడవారు వరుసగా అమ్మవారికి భక్తితో బోనం సమర్పించి తమ మ్రొక్కులను తీర్చుకుంటారు. ఆ రోజు ఆడవారు ముఖంనిండా పసుపు రాసుకుని తడిబట్టలతో రావడం పురాతన ఆచారం. మహిళలు బోనాలను నెత్తిమీద పెట్టుకుని, భేరీ, తప్పెట, కొమ్ము వాద్యాలు మ్రోగుతుండగా ఊరేగింపుగా రావడాన్ని చూడటానికి రెండుకన్నులు సరిపోవు. దీనికంటూ ప్రభుత్వం ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను ముందుగానే ప్రణాళికగా అమలు పరుస్తుంది.

3.వేపాకు సమర్పించుట: వేపాకులను పసుపునీటిలో ముంచి అమ్మవారికి సమర్పించే ఆచారం ముఖ్యమైన క్రియగా భావించబడుతుంది. వర్షాకాలం ప్రారంభమయినప్పుడు సోకే కలరా, మశూచివంటి వ్యాధులను తరిమికొట్టే క్రిమినాశినిగా వేపాకు ఉండటం వల్లనూ, అమ్మవారికి ప్రియమైన వృక్షంగా ఉండటం వల్లనూ వేపాకులను అమ్మవారికి సమర్పించి ఆనందిస్తారు స్త్రీలు.

4.ఫలహారంబండి: 'బోనాలు' జరుపుకునేరోజు భక్తులు తమ ఇళ్ళల్లోనుండి శుభ్రంగా, నియమనిష్ఠలతో తయారుచేసి తెచ్చిన నైవేద్యాలను బండ్లలోపెట్టి ఆలయానికి ప్రదక్షిణం చేయటాన్నే 'ఫలహారంబండి' అనే ఉత్సవంగా జరుపుకుంటారు.

5.పోతురాజు వీరంగం: అమ్మవారి సోదరుడుగా పోతురాజును భావిస్తారు. బోనాలు పండుగ పదిహేనవరోజు తెలంగాణా ప్రాంతంలోని ప్రతి బస్తీనించీ పోతురాజు అమ్మవారి ఆలయానికి లక్షల సంఖ్యలో వీరధీర విన్యాసాలు ప్రదర్శిస్తూ వరదగా తరలివస్తారు. వీరు కాళ్ళకి గజ్జలుకట్టి, ఒళ్ళంతా పసుపు పూసుకుని, పసుపు నీటిలో తడిపిన ఎరుపు వస్త్రం ధరించి, కంటికి కాటుక, నుదుటి మీద కుంకుమ బొట్టుతో, నడుముకు వేపాకులు కట్టి, చేతిలో పసుపు రంగు కొరడా ఝుళిపించి నాట్యంచేస్తూ ఫలహారం బండికి ముందుగా నడచి వెళ్ళడం బోనాలు పండుగయొక్క విశేష ఆకర్షణీయ అంశం.

6.రంగం: ఇది చివరి రోజున జరిగే ముఖ్యఘట్టం. బోనాలు నైవేద్యం ఆదివారం జరుగుతుంది. సోమవారం తెల్లవారుఝామున అమ్మవారి సన్నిధికి ఎదురుగా ముఖమంటపంలో ఉన్న మాతంగీశ్వరి ఆలయంలో అమ్మవారికి ఎదురుగా వివాహంకాని ఒక స్త్రీ వచ్చి ఒకమట్టి కుండ మీద నిలబడి భవిష్యవాణి చెబుతుంది. దీనినే 'రంగం' అంటారు. దేశ రాజకీయం, వ్యవసాయం, వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు అన్నిటినీ ఆ రోజు అమ్మవారు ఆ స్త్రీల ద్వారా తెలుపుతుంది. 'రంగం'పలికే ఆ స్త్రీ, ఒక కత్తికి మాంగ్యం కట్టి, తన జీవితాంతం వివాహం చేసుకోకుండానే ఉండటం ఆనవాయితీ.

7.బలి: రంగం ముగిశాక సోమవారం పోతురాజులు ప్రొద్దున తొమ్మిది గంటల ప్రాంతంలో వీర తాండవం చేస్తూ మైమరచి భక్తి పారవశ్యంతో ఆలయ ప్రదక్షిణం చేస్తారు. అమ్మవారి సన్నిధికి ఎదురుగా వారు ఆడే నృత్యం, మనను భక్తిపారవశ్యంలో ముంచుతుంది. ఆ సందర్భంలో సొరకాయ, ఎర్ర గుమ్మడికాయవంటి కూరగాయల్ని పగుల గొట్టి అమ్మవారికి బలి ఇస్తారు. ఇది వరకు ఎద్దు, మేక, కోళ్లను బలిఇచ్చే వారట. ఇప్పుడు మృగబలి నిషేధం కాబట్టి కూరగాయలను పగులగొట్టి పండుగను పూర్తిచేస్తున్నారు.

8.సాగనంపుట: బలిఇచ్చే కార్యక్రమం పూర్తిఅయ్యాక, సోమవారం



ప్రొద్దున పదిగంటల సమయంలో అమ్మవారి చిత్రపటాన్ని విశేషంగా అలంకరించి కలశాలతోపాటు ఏనుగుమీద ఎక్కించి, మంగళ వాద్యాల ధ్వనులమధ్య వీధులలో ఊరేగింపుగా తీసుకెళ్ళి భక్తులు అమ్మవారిని సాగనంపుతారు. చివరిగా 'ఘటాన్ని' నయాపుల్ ప్రాంతంలో ప్రవహించే మూసీనదిలో నిమజ్జనం చేసి, పండుగను పూర్తి చేస్తారు.

## బోనాల సందర్భంగా పోతురాజులు:

బోనాల సందర్భంగా అమ్మవారి ఊరేగింపు. వనస్థలిపురం పోతురాజు పాత్రను పోషించే వ్యక్తి స్ఫురద్రూపిగా బలశాలిగా ఉంటాడు; ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాలికి గజ్జెలు కలిగి, చిన్న ఎర్రని ధోతీని ధరించి డప్పువాయిద్యానికి అనుగుణంగా ఆడతాడు. ముందు ఫలహారం బండి వద్ద నర్తిస్తాడు. . పోతురాజు పుజాకార్యక్రమాల ఆరంభకుడిగా, భక్త సమూహానికి రక్షకుడిగా భావించబడాతాడు. కొరడాతో బాదుకొంటూ, వేపాకులను నడుముకు చుట్టుకుని, అమ్మవారి పూనకములో ఉన్న భక్తురాండ్రను ఆలయములోని అమ్మవారి సమక్షానికి తీసుకెళతాడు.

## విందు సంబరాలు

బోనాలు పండుగ దేవికి నైవేద్యము సమర్పించు పండుగ కావడం చేత, ఆ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు అతిథులతో పాటు స్వీకరిస్తారు. నివేదనానంతరం మాంసాహార విందు భోజనం మొదలౌతుంది. పండుగ జరిగే ప్రాంతాలలో వేపాకులతో అలంకరించబడిన వీధులు దర్శనమిస్తాయి. జానపద శైలిలో ఉండే అమ్మవారి కీర్తనలతో నిండిన పండుగ వాతావణం వెల్లివిరుస్తుంది.

## రంగం

రంగం, పండుగ రెండవ రోజు ఉదయం జరుగుతుంది. ఈ రంగం కార్యక్రమంలో పోతరాజు వేషం వేసిన వ్యక్తికి పూనకం వస్తుంది. ఈ కార్యక్రమం జాతర ఊరేగింపు తరువాత జరుగుతుంది.

## ఘటం ముగింపు

అమ్మవారి ఆకారములో అలంకరింపబడిన రాగి కలశాన్ని ఘటం అని సంబోధిస్తారు. సాంప్రదాయక వస్త్రధారణ, ఒంటి పై పసుపు కలిగిన పూజారి ఈ ఘటాన్ని మోస్తాడు. పండుగ మొదటి రోజు నుండి, చివరి రోజు నిమజ్జనం దాకా ఈ ఘటాన్ని డప్పుల మేళవాద్యాల నడుమ ఊరేగిస్తూ మిగింపు చేయడం ఆనవాయితీ.

సర్వే జనాః సుఖినో భవంతు.



-శారద శృంగేరి
9490261119

# డబుల్ బెడ్ రూంల నిర్మాణం వెంటనే చేపట్టాలి

-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కదారి రాములు

రాజన్న సిరిసిల్ల, జులై 15:(నేటి నిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలో నిలిచిపోయిన డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణ పనులను సిపిఐ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కదారి రాముడు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నత్తనడకన డబుల్ బెడ్ నిర్మాణం జరుగుతున్నాయన్నారు.

నిర్మాణం పేరిట కొన్ని పిల్లర్లు, స్లాపులు పోసి ఆపడం జరిగిందని తెలిపారు. వేములవాడలో కార్మికులు, ఎంతోమంది కూలీ పనిచేసుకునే నిరుపేదలు కిరాయి కట్టలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తామని, ఇందిరమ్మ ఇండ్లు డబ్బా ఇండ్లని చెప్పి ప్రజల్ని నమ్మించి మోసాగించిందన్నారు. ఇప్పటివరకు సర్వే చేయలేదని, నిర్మస్తున్న డబల్ బెడ్ రూమ్ నిర్మాణంలో లోపం జరుగుతుందని అన్నారు. పది రోజుల్లో పనులను



నిర్మాణం చేయని యెడల సిపిఐ ఆధ్వర్యంలో జెండాలు పాతి, అర్హులైన నిరుపేదలను డబల్ బెడ్ రూమ్ లలో ఉంచుతామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఎన్నో దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ డబల్ బెడ్ రూమ్ నిర్మాణం చేయడం లేదన్నారు. పది రోజులలో పనులను ప్రారంభించి, అర్హులైన వారికి డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేవడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యద ఎల్లా దేవరాజు, సిపిఐ పట్టణ నాయకులు గాజుల దేవయ్య, పెంట మల్లేశం, పెంట గణేష్, దయతకుల పోరాట సమితి డిహెచ్పిహెచ్ గంగన మల్లేశం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# పొంగులేటికి పదవియోగంపై సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు హర్షం

ఖమ్మం, జులై 15: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఆ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ టీపీసీసీ కో ఛైర్మన్ గా పదవి బాధ్యతలు కట్టబెట్టడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ఈ నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ నేత పెద్దమున గాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ పిడిఎస్ రైస్ ను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

-28 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

రాజన్న సిరిసిల్ల, జులై 15:(నేటినిజం ప్రతినిధి): ముస్తాబద్



మండలం నామపూర్ గ్రామం నుండి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తంలిస్తున్న 28 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని టాస్క్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా టాస్కోర్స్ ఎస్ఐ మారుతి మాట్లాడుతూ బియ్యాన్ని అక్రమంగా తరలిసున్నారనే సమా చారం మేరకుటీఎస్36టీఏ 2494 ఆటో తనిఖీ చేయంగా 18 క్వింటాళ్ల బియ్యం, ఎపి36 ఎక్స్2091 ఆటోలో 10 క్వింటాళ్ల బియ్యం ఎక్కిస్తుండగా పట్టుకున్నట్టు పేర్కొన్నారు. రేషన్ బియ్యం ను స్వాధీన పరుచుకొని, నిందితులను అదుపులోకి తీసుకోని తదుపరి చర్యల నిమిత్తం ఆటోలు, పీడీఎస్ రైస్ ను ముస్తాబద్ పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగిందన్నారు. పేదలకు అందవలసిన ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసిన, రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇట్టి టాస్క్ లో టాస్కోర్స్ సిబ్బంది రాజేష్, తిరుపతి, మహిపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆహ్వానం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు
పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో
జాలాది రత్నసుధీర్ రచించిన కథాసంకలనం
మనసు పలికిన ...



ఆవిష్కరణ సభ
సభాధ్యక్షత : శ్రీ.సి.ఎస్. రాంబాబు (కథారచయిత)
ముఖ్య అతిథి - ఆవిష్కర్త : ఆచార్య కొలకలూరి ఇనాక్ (పూర్వ ఉపకులపతి - శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం) పద్మశ్రీ పురస్కార గ్రహీత
ఆత్మీక అతిథులు : శ్రీ.ఎ. దినకర బాబు, ఐఏఎస్. రిటైర్డ్
శ్రీ విహారి, రచయిత, విమర్శకులు
శ్రీ గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట, సాహిత్య మాసపత్రిక
వేదిక
రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ (మొదటి అంతస్థు), హైదరాబాద్
సమయం: 21-07-2023, శుక్రవారం, సాయంత్రం 6.00 గంటలకు

# వృద్ధురాలికి వాకర్ అందజేసిన మై వేములవాడ ట్రస్టు



రాజన్న సిరిసిల్ల, జులై 15:(నేటి నిజం ప్రతినిధి): రాజన్న దేవాలయం పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటున్న 80సంవత్సరాల వృద్ధురాలికిమై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శనివారం వాకర్ ను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ వృద్ధురాలి వాకర్ ఎవరో ఎత్తుకొని పోవడం వల్ల నడవడానికి చేదోడు వాదోడుగా ఉండే వాకర్ లేకుండా పోయిందని ట్రస్ట్ ను అభ్యర్తించగా, బత్తిని సాయి కృష్ణ సహకారంతో వృద్ధురాలికి వాకర్ అందించడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో మై వేములవాడ అన్నదాన ట్రస్ట్ సభ్యులు మధు మహేష్ నాగుల చంద్రశేఖర్ ప్రతాప నటరాజు, చల్లా సత్తయ్య తదితరులు ఉన్నారు.

# మెరుగైన సేవలకు ఉత్తమ సేవ పతకం అందుకున్న ములుగు అదనపు ఎస్ పి బొంగోని సదానందం

-ఆర్ ఎస్ ఐ జలీల్ ఆర్ ఎస్ ఐ సంపత్ రావు ల ను వరించిన ఉత్తమ సేవ మరియు సేవా పతకం

- అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీ గౌష్ ఆలం ఐ పి ఎస్

ములుగు , జులై 15: (నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా లో అదనపు ఎస్ పి (ంఖీ )గా విధులు నిర్వహిస్తున్న బొంగోని సదానందం గారు తన విధులలో కనబరిచిన అంకిత భావం నిజాయితీ తో కూడిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవ అవార్డు ప్రకటించింది.

ప్రస్తుతం అదనపు ఎస్ పి గా విధులు నిర్వహిస్తున్న సదానందం గారు 1992వ ఆర్ఎస్ఐ బ్యాచ్ కు ఎంపిక కాగా తన సర్వీసులో అనేక మైలురాళ్లను దాటారు 1993 లో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ చేశారు. 1997లో బీహార్ లో ఎక్స్ప్లోజివ్స్ ట్రైనింగ్ లో నైపుణ్యం సాధించారు 2003లో NSG కమాండో ట్రైనింగ్ వంటి పలు వృత్తి పరమైన ట్రైనింగ్ విజయవంతంగా చేసారు. నిరుపేద పోలీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగార్థులుగా తీర్చి దిద్దడంలో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటచేసిన మహోత్తర శిక్షణ కార్యక్రమానికి (సుమార్గ్ )ఇంచార్జి గా వ్యవహరించి 1000 మంది అభ్యర్థులు శిక్షణకు హాజరు కాగా 350 మందిని వివిధ రంగాలలో ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దారు అంతేకాకుండా నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన 1000 మంది విద్యార్థులకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ వరంగల్ (NIT) నందు కంప్యూటర్ స్కిల్స్ ఫిట్టింగ్ వెల్డింగ్ లాంటి టెక్నికల్ స్కిల్స్ లో శిక్షణ ఇప్పించారు.

ఉత్తమ సేవ పథకం కు ఎంపికైనందున జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఓ ఎస్ డి అశోక్ కుమార్ ఏ ఎస్ పి ఏటూర్నాగారం గారు సదానందం గారిని సన్మానించారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com